www.prajasakti.com

# ప్రజాశక్తి

శనివారం 11 ఫిబ్రవరి 2023 | 5 | పశ్చిమ గోదావరి




## విధిగా తనిఖీలు నిర్వహించాలి

### జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ

**ప్రజాశక్తి - భీమవరం**

చౌక ధరల దుకాణాలు, పెట్రోల్ బంకులను తరచూ విధిగా తనిఖీలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో జెసి సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఎఫ్‌పి షాపులను తరచూ తనిఖీ చేసి స్టాకు నిల్వల రికార్డులను పరిశీలించాలన్నారు. స్టాక్‌లో వ్యత్యాసాలుంటే చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ డిస్ట్రిబ్యూషన్ వెహికల్స్‌కు ఖాళీగా ఉన్న డ్రైవర్ల పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.సరోజ, సహాయ పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.



# వైసిపిలో గ్రూపుల పోరు

- కొనసాగుతున్న గ్రూపు విభేదాలు
- మూడేళ్లుగా కొలిక్కిరాని పరిస్థితి
- చక్కదిద్దడంలో అధిష్టానం విఫలం
- గందరగోళంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు
- ఇప్పటికే విడుదలైన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్
- ఈసారి రాజకీయాలు రసవత్తరమే
- ఉమ్మడి జిల్లాలో సర్వత్రా ఎన్నికల చర్చ

**ప్రజాశక్తి - భీమవరం**

గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ వెలువడింది. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలపై సర్వత్రా చర్చ జరుగుతుంది. ఇదిలా ఉంటే అధికార పార్టీలో కలహాలు, అంతర్గత విభేదాలు ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయి. బరిలో ఉండేది ఎవరు.. ఉన్నా.. గెలిచేది ఎవరు అన్న చర్చ గ్రామగ్రామాన నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీలుగా ఉన్న అంగర రామ్మోహన్‌రావు, టి.సత్యనారాయణరాజు (పాందువ శ్రీను) పదవీ కాలం వచ్చేనెల మూడో తేదీతో పూర్తికానుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఈ రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ రెండు స్థానాలు ప్రస్తుతం టిడిపికి చెందిన ఎమ్మెల్సీలు ఉన్నారు. ఈసారి ఈ ఎన్నికల్లో వీటిని వైసిపి ఏకగ్రీవంగా కైవసం చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు ఉంటారు. ఎంఎల్‌సి ఎన్నికలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరగడం, ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీ వైసిపికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉండటంతో రెండు స్థానాలు ఆ పార్టీ కైవసం చేసుకునే అవకాశాలున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ కూడా ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఆశావాహులు ఎవరికి వారే వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ప్రముఖంగా కొన్ని పేర్లు వినబడుతున్నప్పటికీ మిగిలిన ఆశావహులు తమదైన రీతిలో పావులు కదుపుతున్నారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన మంత్రులను, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు పరుగులు తీస్తున్నారు. తాము పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నామని కొందరు గొప్ప అంటుంటే.. మరికొందరు సామాజికంగా ఆర్థికంగా తామే గొప్ప అంటూ బలాలను నిరూపించుకుంటున్నారు. ఇలా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో వచ్చే సార్వత్రిక ఎన్నికలపై కూడా తీవ్ర చర్చ జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో గ్రామ గ్రామాన ఎన్నికలపై చర్చలు, సమావేశాలు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదిలా ఉంటే అధికార వైసిపిలో ఉమ్మడి జిల్లాలో ఉన్న ముసలం తాజాగా తెరపైకి వస్తుంది. పార్టీలో నాయకులు మధ్య కలహాలు అంతర్గత విభేదాలు మరోసారి బయటపడుతున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో అధికార వైసిపిలో భగ్గుమంటున్న గ్రూపు విభేధాలు**


రాష్ట్రంలో ఏ పార్టీ అధికారం చేపట్టాలన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపైనే ఆధారపడి ఉంటుంది. ఇక్కడ ఏ పార్టీకి క్లీన్ స్వీప్ వస్తే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం చేజిక్కించుకుంటుందని చెబుతుంటారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 15 స్థానాలు టిడిపి కైవసం చేసుకుంది. 2019లో ఉండి, పాలకొల్లు మినహా మిగిలిన 13 నియోజకవర్గాల్లో వైసిపి పాగా వేసింది. అయితే రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో స్థానాలను కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా ఆయా పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఇలా ఉంటే అధికార పార్టీలో ఏర్పడిన ముసలం, నేతల మధ్య కలహాలు, వర్గ విభేదాలు తాజాగా తెరపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ముఖ్యనేతలు అయోమయంలో పడ్డారు. పాలకొల్లు నియోజకవర్గంలో గతం నుంచి గ్రూపుల పోరు నడుస్తుంది. ఈ తరుణంలో అధిష్టానం పలుమార్లు హెచ్చరించినప్పటికీ కిందస్థాయి కేడర్, వీటికి నాయకత్వం వహిస్తున్న నాయకులు బేఖాతర్ చేస్తున్నారు. ఇక్కడ పార్టీ ఓటమి పాలవడంతో జెడ్‌పి ఛైర్మన్ కౌరు శ్రీనివాస్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన నేతృత్వంలో పార్టీ నేతలు ఉమ్మడి కార్యాచరణకు రావాలని, పార్టీ బలం పెరిగేలా వ్యవహరించాలని అధిష్టానం ఆశించినప్పటికీ పెడచెవిన పెట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కౌరు శ్రీనివాసకు వ్యతిరేకంగా వైసిపిలో కొందరు నేతలు వ్యవహరిస్తున్నారు. ఆయన తగిన సమాచారం ఇవ్వడం లేదని, కొందరికి మాత్రమే ప్రాధాన్యతిస్తూ మరికొందరిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జిగా ఉన్న కవురు శ్రీనివాస్, పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ తాతాజీ ఎవరికివారే యమునా తీరు అన్నట్లు వ్యవహరిస్తూ వారి సొంత కార్యక్రమాలకే ప్రాధాన్యతిస్తూ ముందుకు సాగడంతో పార్టీ కేడర్‌లో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇక్కడ మూడేళ్ల నుంచి పార్టీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

మెట్ట ప్రాంతమైన చింతలపూడి నియోజకవర్గ వైసిపిలో అసంతృప్తి సెగలు ఎగసిపడుతున్నాయి. స్థానిక ఎంఎల్‌ఎ ఎలిజాకు అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా ఇంకొందరు గళం విప్పుతున్నారు. ఆయన అనుయాయులపై గతంలో అనేక అవినీతి ఆరోపణలు కూడా వినిపించాయి. ఇదిలా ఉంటే ఇప్పటికే నియోజకవర్గంలో ఎంపీ కోటగిరి శ్రీధర్ గ్రూపు నేతలు, ఎమ్మెల్యే గ్రూపు నేతలు విడిపోయి ఎవరికివారు వారు తమదే పెత్తనం సాగాలంటూ వ్యవహరిస్తున్నారు. అయితే ఈ వ్యవహారం అంతా అధిష్టానం దృష్టికి వెళ్లినప్పటికీ పట్టించుకోలేదని పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలోనూ తరచూ అంతర్గత విభేదాలు తెరపైకి వస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో వైసిపిని బతికించింది ఎవరని అడిగితే ఠక్కున పివిఎల్.నరసింహరాజు అని చెబుతుంటారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ పివిఎల్‌కు పార్టీ బాధ్యతలను అప్పగించింది. కొద్దికాలం తర్వాత ఆ బాధ్యతల నుంచి అధిష్టానం తప్పించింది. ఆ స్థానంలో సీనియర్ నేత గోకరాజు రామరాజుకు పార్టీ బాధ్యతలు అప్పగించింది. ఇక్కడ ఒక మాజీ ఎమ్మెల్యే సర్రాజును కూడా పక్కన పెట్టారు. అయితే సర్రాజుకు క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని అప్పగించారు. ఇలా నియోజకవర్గంలో అధికార వైసిపిలో గ్రూపులు ఏర్పడడం, పివిఎల్‌కు అనుకూలంగా కొందరు, రామరాజుకు ఇంకొందరు వ్యవహరిస్తున్నారు. ఇది కాస్తా ముదిరి పాకాన పడటంతో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభ సమయంలో మళ్లీ పార్టీ బాధ్యతలను అధిష్టానం డిసిసిబి ఛైర్మన్‌గా ఉన్న పివిఎల్‌కు అప్పగించింది. ఈ క్రమంలో జిల్లాలోనే పివిఎల్ ముందు వరుసలో ఉండి తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. అయితే గ్రూపు విభేదాలు మాత్రం తరచూ వెంటాడుతుండటంతో వైసిపి నాయకుల్లో, కార్యకర్తల్లో అసంతృప్తి సెగలు అలానే కొనసాగుతున్నాయి. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకుతో పాటు ఏలూరు జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో గ్రూపు విభేదాలు, పార్టీలో అంతర్గత కలహాలు నివురుకప్పిన నిప్పులా ఉన్నాయి. ఈ పరిస్థితులను పార్టీ అధిష్టానం ఏ విధంగా చక్కదిద్దుతుందో వేచిచూడాలి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధిష్టానం ఈ జిల్లాపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేయాలి : యుటిఎఫ్

**ప్రజాశక్తి - భీమవరం**





మాట్లాడుతున్న యుటిఎఫ్ నేతలు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిన పడిందని సిఎం జగన్ ప్రకటించడం.. మరోపక్క రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉండటం.. వంటి అర్థం కాని లెక్కలతో అందరినీ మాయచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్.ప్రసాద్ డిమాండ్ చేశారు. భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ నెల ఐదో తేదీలోపు 95 శాతం మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం ఈనెల పదో తేదీ వచ్చినప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మాత్రమే జీతాలు చెల్లించారని, 70 శాతం జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. వీటిగురించి అడుగుతుంటే ప్రజలకు డబ్బులు ఇస్తున్నామని ఉద్యోగ, ఉపాధ్యాయుల రెండో ప్రాధాన్యత అని చెబుతుండటం సిగ్గుచేటన్నారు. ఎన్నడూ లేని విధంగా ఉద్యోగులకు ఒకటిన్నర సంవత్సరాలుగా చెల్లించవలసిన పిఎఫ్, ఎపిజిఎస్‌ఐ, డిఎలు, సరెండర్ లీవులు సహా అనేక అరియర్లు సుమారు రూ.మూడు వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిందని, వాటిని కనీసం కొంతమేరకైనా చెల్లింపు చేయకపోగా వేతనాలు సైతం ఒకటో తేదీకి చెల్లించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. ముఖ్యంగా ప్రతినెలా అందరికి వేతనాలు చెల్లించిన తర్వాతనే ఉపాధ్యాయులకు చెల్లిస్తున్నారనే భావన సర్వత్రా నెలకొందన్నారు. దానికి తగ్గట్టుగానే ఈ నెల ఒక్క ఉపాధ్యాయునికి కూడా వేతనం అందలేదన్నారు. వేతనాలు ఆలస్యం వల్ల బ్యాంక్ లోన్లకు సంబంధించి ఇఎంఐలు చెల్లించలేకపోతున్నారని, దీంతో పెనాల్టీలు చెల్లించాల్సి రావడంతోపాటు భవిష్యత్‌లో రుణాలు పొందలేని పరిస్థితి కూడా ఏర్పడుతుందన్నారు. అలాగే ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఎఫ్, ఎపిజిఎలు, డిఎ తదితర బకాయిలు జనవరి 15 నాటికి కొంతమేర చెల్లిస్తామని డిసెంబర్‌లో జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక శాఖ అధికారులు ప్రకటించారని, గడువు ముగిసి నెలరోజులు దాటినా దాని ఊసే ప్రస్తావించడం లేదని విమర్శించారు. అలాగే మూడు రోజుల్లో డిఎ ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకూ ఒక్క డిఎ కూడా ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ పరిస్థితులను గమనిస్తే రాష్ట్ర ఆర్థిక పురోగమనంపై సందేహాలు కలుగుతున్నాయని, వాస్తవ పరిస్థితులు ఏమిటో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సహాధ్యక్షులు, కె.సురేష్‌కుమార్, సమాధ్యక్షురాలు ఎన్.కుసుమ కుమారి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీ రాజా, ఎస్ఎస్ నాయుడు, జిల్లా అధ్యక్ష ప్రధానకార్యర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, ఎన్.నాగమణి పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

### కలెక్టర్ ప్రశాంతి

**ప్రజాశక్తి - భీమవరం**

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఎన్నికల నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 16న జారీ చేస్తారన్నారు. 23 నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 24న నామినేషన్ల పరిశీలన, 27 వరకూ ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. వచ్చేనెల 13వ తేదీన ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు మార్చి 16వ తేదీన ఉంటుందన్నారు. గతంలో జిల్లాలో జరిగిన ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో ప్రస్తుతం జరిగే ఎన్నికలను కూడా పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. నిర్దేశించిన తేదీల్లో ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల విధులకు నియమించిన అధికారులందరూ తప్పకుండా శిక్షణకు హాజరుకావాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు.. భద్రత ఏర్పాట్లను కూడా సంసిద్ధం చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూము, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ తదితర ప్రాంతాలవద్ద నిబంధనల మేరకు బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళిని తూచా తప్పక అందరూ పాటించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, అదనపు ఎస్‌పి రవికుమార్ పాల్గొన్నారు.

## 15లోపు ఇ-పంట నమోదు పూర్తి చేయాలి : జెసి

**ప్రజాశక్తి - భీమవరం**

ఇ-పంట నమోదు ఈనెల 15లోపు పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జెసి వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. ఇకెవైసి ఫిబ్రవరి 20వ తేదీలోపు తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎరువులు, పురుగుమందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువుల అమ్మకాలకు నిర్దేశించిన లక్ష్యాన్ని 54 శాతం మాత్రమే పూర్తిచేయడంపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లక్ష్యసాధన నూరు శాతం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఎరువులు అమ్మగా వచ్చిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖాతాలో జమచేయాలని ఆర్‌బికె సహాయకులను ఆదేశించారు. నగదు జమలో దుర్వినియోగం జరిగినట్లు తన దృష్టికి వస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. పిఎం కిసాన్‌లో మిగిలిన 24 వేల మంది రైతులకు త్వరితగతన బయోమెట్రిక్ ద్వారా అథంటికేషన్ చేసి ఇకెవైసి పూర్తిచేయాలని సూచించారు. ఎన్‌పిసిఐ ఆధార్ లింక్ కాకపోవడం వల్ల సుమారు 1765 మంది రైతులు పిఎం కిసాన్ పొందలేకపోతున్నారన్నారు. వారికి వెంటనే పోస్టాఫీస్‌లో ఐపిపిబి ద్వారా ఖతాలు తెరవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎ.దుర్గేష్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, ఎడిఎలు, ఎంఇఒలు, విఎఒలు పాల్గొన్నారు.

## హమారా ప్రసాద్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి : కెవిపిఎస్

**ప్రజాశక్తి - భీమవరం**

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పైన, రాజ్యాంగంపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై తక్షణం దేశ ద్రోహం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోషల్ మీడియాలో హమారా ప్రసాద్ విడుదల చేసిన వీడియోలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల, రాజ్యాంగంపై మాట్లాడిన వ్యాఖ్యలను కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతి బాబు ఖండిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మనువాద మతోన్మాది హమారా ప్రసాద్ ప్రజల పట్ల మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాడని మండిపడ్డారు. గాంధీని చంపిన గాడ్సే వారసుడిగా ప్రకటించుకోవడం తన మతోన్మాదానికి ప్రతీక అన్నారు. 'అంబేద్కర్ బతికి ఉంటే గాంధీని గాడ్సే కాల్చినట్లే నేను కూడా అంబేద్కర్‌ను కాల్చి చంపేవాడిని' అంటూ బహిరంగంగా ప్రకటించడాన్ని ఉపేక్షించరాదన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం ఈ వ్యాఖ్యలపై జోక్యం చేసుకోవాలన్నారు. ఇప్పుడు మౌనంవహిస్తే హమారా ప్రసాద్ వంటి అనేకమంది మతోన్మాదులు పుట్టుకొస్తారని తెలిపారు. ప్రజల మధ్య ఘర్షణలు తేవాలనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని వాపోయారు. హమారా ప్రసాద్ వంటి నీచులు ఇంతలా మాట్లాడుతున్నారంటే అదే రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలే కారణమని గుర్తుచేశారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా ఉన్న హమారా ప్రసాద్ బిజెపి అనుబంధ సంఘంగా రాష్ట్రీయ దళిత సేన పేరుతో దళితులనే మోసం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధర్మం పేరుతో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు ఊడిగం చేస్తూ ప్రజల మధ్య నిరంతరం మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. తక్షణం అతని సోషల్ మీడియా అకౌంట్స్ అన్నీ బ్లాక్ చెయ్యాలని డిమాండ్ చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం దళిత, గిరిజనుల పట్ల విద్వేషం కల్పిస్తుందని అందుకే ఇలాంటి వారిని ప్రయోగిస్తున్నారని విమర్శించారు. మనుస్మృతి అమలు జరపడమే బిజెపి ప్రభుత్వ విధానమని ఆరోపించారు. తక్షణం హమారా ప్రసాద్ వ్యాఖ్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించి అరెస్టు చెయ్యాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఎన్నికల కోడ్ అమలు చేయండి

### తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు

**ప్రజాశక్తి - ఆకివీడు**

ఎన్నికల నిబంధనలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయని, తగిన జాగ్రత్తలు తీసుకుని వాటిని అమలు చేయాలని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంకాలం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిబ్బందికి అధికారులు పలు సూచనలు చేశారు. మార్చి 13వ తేదీన జరగనున్న కౌన్సిల్ ఎన్నికల కార్యక్రమం ఈనెల 16వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్‌తో ప్రారంభమవుతుందన్నారు. అయితే కోడ్ ఇప్పటికే అమల్లో ఉందన్నారు. తక్షణం కోర్టుకు సంబంధించిన చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎండిఒ శ్రీకర్, డిప్యూటీ తహశీల్దార్ రాజు కిషోర్ పాల్గొని పలు అంశాలను వివరించారు.

## విద్యారంగ సమస్యలపై పోరాడాలి

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

**ప్రజాశక్తి - భీమవరం**





మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరాయంగా పోరాడుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్య వ్యతిరేక విధానాలపై మరింత పోరాడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పిలుపునిచ్చారు. భీమవరం తాపీ పనివాళ్ల సంఘం భవనంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ 44వ జిల్లా మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ అనేక ఏళ్లుగా విద్యారంగ సమస్యలపై నిరంతరంగా పోరాడుతోందన్నారు. దీనిలో భాగంగా ఎంతోమంది కార్యకర్తలు ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో విద్యార్థుల, రాష్ట్ర హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాలతో కలిపి బస్సు యాత్ర నిర్వహించామని గుర్తు చేశారు. ఈ హక్కుల సాధన కోసం అవసరమైతే విద్యార్థి యువజన సంఘాలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసివచ్చే అన్ని సంఘాలను కలుపుకొని చలో పార్లమెంటుకు పిలిపిస్తామన్నారు. అలాగే ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాలు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులపై అక్రమంగా పెడుతున్న కేసులను తప్పుబట్టారు. గత మహాసభ నుండి ఈ మహాసభ వరకూ జరిగిన కార్యక్రమాల వివరాలను జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు ప్రవేశపెట్టారు. అనంతరం మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. నరసాపురంలో ఆక్వా యూనివర్సిటీ పనులు చేపట్టాలని, జిల్లాలో ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌కు స్టైఫండ్ ఇవ్వాలని ప్రవేశపెట్టిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మహాసభలో జిల్లా అధ్యక్షులు పి.వాసు, ఉపాధ్యక్షులు ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు యుగంధర్, జాన్, మణికంఠ భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## రోడ్ల అభివృద్ధికి పటిష్ట చర్యలు : గ్రంథి

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆర్‌అండ్‌బి అధికారులతో నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో ప్రతి రోడ్డునూ అభివద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రూ.పది కోట్లతో దిరుసుమర్రు నుంచి వెంప మెయిన్ రోడ్డు వరకూ రోడ్డు నిర్మించామని తెలిపారు. అలాగే పలు మెయిన్ రోడ్లను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. వీరవాసరం మండలంలో మత్స్యపురి, పెనుమంట్ర నుండి వీరవాసరం, పడమటి పాలెం నుంచి తోలేరు రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల పాటు కరోనా వల్ల ఇబ్బందులు తలెత్తడంతో రోడ్ల పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయని తెలిపారు. అయితే కరోనా ఉధృతి తగ్గిన తర్వాత గతేడాది నుండి రోడ్ల పనులను వేగవంతం చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బి ఇఇ లోకేశ్వరరావు, డిఇ రామరాజు, జెఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలో సబ్‌కలెక్టర్ తనిఖీలు

**ప్రజాశక్తి - మొగల్తూరు**



సిబ్బందిని వివరాలు అడుగుతున్న సబ్‌కలెక్టర్

మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ల్యాబ్‌లో ఏయే రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ల్యాబ్ టెక్నీషియన్ కిషోర్ ఉన్నారు.

## అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఏప్రిల్ 5వ తేదీన రైతు, కార్మిక, వ్యవసాయ కార్మికులు చేపట్టిన నిరసనను జయప్రదం చేయాలని కోరుతూ తాడేపల్లిగూడెం అపరాలు అండ్ ఫ్లోర్ మిల్లు జట్టు వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం స్థానిక చుక్కా అప్పలస్వామి భవనంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. యూనియన్ సీనియర్ కార్మికులు మేడపాటి సత్తిరెడ్డి పతాకాన్ని ఆవిష్కరించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు కరెడ్ల రామకృష్ణ, యూనియన్ అధ్యక్షులు గొన్నాబత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు కార్మిక వర్గానికి తీవ్ర నష్టదాయకమన్నారు. ఒక పక్క కార్మిక చట్టాల్లో మార్పు, ప్రభుత్వ రంగాల అమ్మకం, ఉద్యోగులు తొలగింపు చట్టాలు పార్లమెంట్లో మార్పు చేయడం వల్ల కార్మిక వర్గం చాలా ఇబ్బందులకు గురవుతోందన్నారు. ప్రజలకు నిత్యావసర వస్తువులు సరఫరా చేయడంలో కీలకంగా పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సౌకర్యాలూ అందడం లేదని వారు విమర్శించారు. ఒకపక్క ధరలు పెరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకుండా దేశ ప్రజలను గాలికొదిలేసిందన్నారు. జిఎస్‌టి పేరుతో వేల కోట్ల రూపాయలు ప్రజల జేబులకు చిల్లుపెట్టే విధానాలు తీసుకొచ్చాయన్నారు. బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగానూ, కార్పొరేట్లకు అనుకూలంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఈ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలన్నారు. ఢిల్లీలో ఏప్రిల్ 5వ తేదీన జరిగే ధర్నాలో సిఐటియు అనుబంధం అపరాల అండ్ ఫ్లోర్ మిల్ వర్కర్స్ యూనియన్ నుంచి పెద్ద ఎత్తున పాల్గొంటామని తెలిపారు. ఈ సమావేశానికి చిటికెన రాము, సిద్ధిరెడ్డి శేషుబాబు, సుందరపు అప్పలనాయుడు, రావి శ్రీనివాసు, అయినాల సత్యనారాయణ, బొడ్డు భవాని శంకరం, పెంటకోట గోవిందు, అయినాల ధర్మారావు, చిట్టేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

## పెర్కిపాలెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

### సిపిఎం మండల కమిటీ డిమాండ్

**ప్రజాశక్తి - వీరవాసరం**

మండలంలోని పెర్కిపాలెం గ్రామంలో వెంటనే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లా కమిటీ సభ్యుడు జుత్తిగ నరసింహమూర్తి ఒక ప్రకటన విడుదల చేశారు. పెర్కిపాలెంలో పదిహేను రోజులుగా పలువురు విషజ్వరాలతో ఆసుపత్రి పాలవుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై వైద్యాదికారుల దృష్టికి తీసుకెళితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరినా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులు సుమారు ఇరవై మంది వరకూ భీమవరం ప్రయివేటు ఆసుపత్రిలో వైద్య పొందుతున్నారని తెలిపారు. దీంతో వైద్యానికి సుమారు యాబై వేల వరకూ ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. తక్షణం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని నరసింహమూర్తి డిమాండ్ చేశారు.

# 145 మందికి కళ్యాణమస్తు, షాదీ తోఫా : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా పథకాల ద్వారా జిల్లాలో అర్హులైన 145 మంది మహిళలకు రూ.కోటి 10 లక్షల 65 వేలు వారి ఖాతాల్లో జమ చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఈ పథకాల సొమ్ముకు సంబంధించిన డమో చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షెడ్యూల్డ్ సామాజిక తరగతివారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున 52 మందికి రూ.52 లక్షలు, కులాంతర వివాహం చేసుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.1.20 లక్షల చొప్పున 9 మందికి రూ.10 లక్షల 80 వేలు, షెడ్యూల్డ్ ట్రైబల్ వారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున, షెడ్యూల్డ్ ట్రైబల్ వారు కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.1.20 లక్షలు, బిసిలకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున 65 మందికి రూ.32 లక్షల 50 వేలు ఖాతాల్లో జమ చేశామన్నారు. బిసి మహిళలు కులాంతర వివాహం చేసుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.75 వేలు చొప్పున 15 మందికి రూ.11 లక్షల 25 వేలు, మైనార్టీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష, వికలాంగులకు ఒక్కొక్కరికి రూ.లక్ష 50 వేలు చొప్పున ఒక్కొక్కరికి, ఒసిలలో భవన నిర్మాణ కార్మికుల కార్డు కలిగిన వారికి ఒక్కొక్కరికి రూ.40 వేలు చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.శోభారాణి పాల్గొన్నారు.

అమ్మఒడి పథకం అనాథ పిల్లలకు ఆసరాగా నిలుస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కోవిడ్ కారణంగా అనాథలుగా మారిన పిల్లలకు అమ్మఒడి చెక్కులను శుక్రవారం కలెక్టర్ పంపిణీ చేశారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న విద్యా కానుక కింద విద్యార్థులకు పుస్తకాలు, బెల్టులు, షూ, బ్యాగు తదితర వస్తువులు అందజేయడంతో పాటు, స్కూల్ ఫీజు కూడా లేదని, అయినా అదనంగా అమ్మ ఒడి పేరున రూ.15 వేల నగదును అందించడం గొప్ప విషయమన్నారు.

## మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పాలారి రామ్మూర్తి దాతృత్వానికి మారుపేరుగా నిలుస్తారని భీమవరం యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎం.నిర్మల జ్యోతి తెలిపారు. శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పాలారి రామ్మూర్తి పేరిట వారి కుమారులు నలుగురు పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా త్యాగరాజ భక్త సభ సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య మాట్లాడుతూ పాలారి వారి కుటుంబానికి ఈ ప్రాంతంలో ఒక స్థానం ఉందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రామ్మూర్తి కుమారులు శివరావు, సూరిబాబు, కిషోర్ ఆర్థిక సహకారంతో నలుగురు పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ అయ్యగారి శ్రీరామ్, పాలారి సుధ, మల్లయ్య పాల్గొన్నారు.

## త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి - కాళ్ల

లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇ పి.సీతారామాంజనేయరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో 20 లేఅవుట్లు ఉన్నాయన్నారు. 1057 ఇళ్లకు గాను ఇప్పటివరకూ 525 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. 44 ఇళ్లు అసలు మొదలు కాలేదని తెలిపారు. మిగతా 478 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మార్చి 21వ తేదీ ఉగాది నాటికి ఆ ఇల్లు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ప్రతిరోజు రెండు సచివాలయాలకు వెళ్లి హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

## ఉగాది కవితల పోటీలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉగాది వేడుకల్లో రాష్ట్రస్థాయి కవితలు, కథలు, నానీలు, సామెతలు తదితర పోటీలను నిర్వహిస్తామని, మార్చి 11వ తేదీలోపు తమకు అందించాలని నిర్వహణ కమిటీ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. మాజీ ఎంఎల్‌సి బొమ్మిడి నారాయణరావు మాట్లాడుతూ ప్రతివారిలో రచనా శైలిని పెంపొందించాలన్నారు. కనుమరుగైపోతున్న సంస్కృతిని కాపాడుతూ ఉగాది వేడుకలను సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రస్థాయిలో ఇటువంటివి ఎంతో స్ఫూర్తినిస్తాయని, అందరూ పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చుక్కనశ్రీ, కలిగొట్ల గోపాల శర్మ, బొమ్మిడి చందు, నీలాది పోతయ్య, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భీమవరంలో అన్నసమారాధన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మావుళ్లమ్మ 59వ వార్షిత్సవంలో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన అఖండ అన్నసమారాధనకు యాత్రికులు పోటెత్తారు. జనవరి 13న ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం మహా నివేదనతో ముగిశాయి. బుర్రకథలు, హరికథలు, కోలాటాలు, సంగీత విభావరి, సినీ మ్యూజిక్ నైట్, విద్యుత్ కాంతులతో 29 రోజులపాటు ఉత్సవాలు అంబరాన్ని తాకాయి.

**పోలీసుల అత్యుత్సహం .. అమ్మవారి దర్శనం నిలిపివేత**

మావుళ్లమ్మ మహా నివేదనలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఎంఎల్‌ఎ గ్రంథి శ్రీనివాస్ దేవస్థానంలో ఉన్నంత సేపూ పోలీసులు యాత్రికులపై విరుచుకుపడ్డారు. ఎంఎల్‌ఎ వెళ్లిన అనంతరం పోలీసులు సినిమా పాత్ర వహించారు. ఒకానొక సమయంలో అమ్మవారిని దర్శించుకున్న యాత్రికులకు అమ్మవారి దర్శనం దొరకలేదు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, ఆలయ ఇఒ యర్రంశెట్టి భద్రాజీ, నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**మొగల్తూరు :** మొగల్తూరులోని ఆదిలక్ష్మమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అన్న సమారాధన చేశారు. ఇటీవల అమ్మవారికి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జాతర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులకు ఏర్పాట్లు చేశారు.

## వివేకా హత్య కేసులో జగన్‌కు పాత్ర

### ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు విమర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

వివేకానందరెడ్డి గొడ్డలి పోటుపై పూర్తి వివరాలతో 'జగనాసుర రక్తచరిత్ర' పుస్తకం విజయవాడ కేంద్ర పార్టీ కార్యాలయంలో టిడిపి ముఖ్య నేతలతో కలిసి ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో బాబాయ్ గొడ్డలి పోటు కథ చిత్రానికి స్క్రీన్ ప్లే, దర్శకత్వం, నిర్మాతగా వ్యవహరించిన అబ్బాయి బండారాన్ని సాక్ష్యాలతో పొందుపర్చినట్లు నిమ్మల చెప్పారు. వివేకానంద రెడ్డి హత్యకు పాత్రధారి, సూత్రధారి జగన్ అన్నారు. నైతిక విలువలు ఉంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హత్యపై సిట్ వేశారని అడిషనల్ డిజిపి స్థాయి అధికారి దర్యాప్తు చేయాల్సి ఉంటే దాన్ని కూడా జగన్ నిర్వీర్యం చేసి, ఎస్‌పి స్థాయికి తగ్గించారని చెప్పారు. ఈ కేసును గంటకు లక్షకు పైన తీసుకునే కపిల్ సిబాలు వంటి న్యాయమూర్తిని పెట్టారంటే దీని వెనక కచ్చితంగా జగన్ పాత్ర ఉందని తెలిపారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - పాలకొల్లు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిఐ ఎల్.చిరంజీవి తెలిపారు. డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఇన్‌క్లూసివ్ సెంటర్ ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ పాలకొల్లు వారిచే డ్రగ్స్ రహిత ఎపిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులే లక్ష్యంగా డ్రగ్ మాఫియా విస్తరిస్తోందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారకూడదన్నారు. చాక్లెట్ రూపంలో, ఇతర తినుబండారాల్లో డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, పిఒ.నోబుల్ రాజ్, ఎస్ఐ ఖాసిం, రమేష్, అమిత, వీరభద్రం పాల్గొన్నారు.

## ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

గవరపేటలో హెల్త్‌అండ్‌హెల్త్ సెంటర్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం శుక్రవారం డాక్టర్ నవ్య జీవన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి పొలిమేర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. రోగికి అవసరమైన అన్ని పరీక్షలూ నిర్వహించి మందులన్నీ ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.ప్రభాకర్, ఎంఎల్‌హెచ్ పి.ప్రశాంతి, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఎఎన్ఎం కనకదుర్గ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

## పేద వధువుకు వాకర్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పెళ్లంటే నూరేళ్ల పంట. పందిళ్లు, సందళ్లు, భాజాలు, భజంత్రీల మాట ఎలా ఉన్నా మూడుముళ్లు వేయడానికి తాళిబొట్టు, కనీస సామగ్రి అవసరమే. పేదలకు ఇవి కూడా భారమే. పట్టణంలోని 3వ వార్డుకు చెందిన పెంటపాటి దుర్గ వివాహం ఈ నెల 15వ తేదీన జరగనుంది. విషయం తెలియడంతో వాకర్స్ క్లబ్ ఆమెకు వివాహానికి అవసరమైన తాళి బొట్టు, పెళ్లి సామగ్రిని క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, లక్ష్మీ శారదాదేవి దంపతుల చేతుల మీదుగా ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ధనాని శ్రీరామ్మూర్తి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



దుర్గకు సాయం అందజేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

## గర్భిణుల పట్ల ఎఎన్ఎంలు శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

గర్భిణుల పట్ల ఎఎన్ఎంలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలనూ తనిఖీ చేశారు. కుటుంబ నియంత్రణ, శస్త్ర చికిత్సలు, ఫ్యామిలీ ఫిజిషన్ విధానంలో వైద్యులు, సిబ్బంది పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆరోగ్య కేంద్రానికి డెలివరీ టేబుల్ అందించిన ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి)ను, బేబీ వార్ రమ్ అందించిన దాసరి భాస్కరరావు, ఇన్నర్ వీర్ సాయం చేసిన ఆలమూరుకు చెందిన బంగార్రాజు తదితర దాతలను అభినందించారు. అనంతరం డ్రైడే కార్యక్రమంలో గ్రామాన్ని సందర్శించి, దోమలు రాకుండా మందు పిచికారీ చేశారు. అనంతరం ఆలమూరు-1 హెల్త్ సెంటర్‌ను సందర్శించి సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.గంగునాయుడు, డాక్టర్ కొడాలి ప్రదీప్ కుమార్, ఎస్‌యుఒ జి.వెంకటేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్‌లో ఛాంబర్స్ విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ డిగ్రీ ఫస్ట్ ఇయర్ 2వ సెమిస్టర్ ఫలితాల్లో ఛాంబర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్లు సాధించి మరోసారి చరిత్ర సృష్టించారు. బిఎస్‌సి ఫలితాల్లో జి.స్వాతిశ్రీ 9.8 పాయింట్లు, కె.సువర్ణకుమారి 9.8 పాయింట్లు, ఎ.హర్షిణి 9.6, డి.చైతన్యమని 9.6, ఎం.మౌనిక 9.6, టి.సింధు 9.6 పాయింట్లు, ఎస్.హేమలత 9.6 ఎన్.జోష్ణవి 9.6, ఎం.పూర్ణిమ 9.5, ఎం.గాయత్రీ 9.5, సిహెచ్ హిమవర్షిణి 9.5 సాధించారు. బీకాం ఫలితాల్లో సిహెచ్. శ్రీవల్లి 9.7 ఇలా 38 మంది విద్యార్థులు 9.0 గ్రేడ్ పాయింట్లు సాధించారు. బిఎస్‌సిలో 90 శాతం, బీకాంలో 85 శాతం, బిబిఎ లో 82 శాతం పర్సంటేజ్ సాధించినట్లు ఛాంబర్స్ కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు, ఛైర్మన్ తటవర్తి కృష్ణమూర్తి, ఛాంబర్ సెక్రటరీ దేవరపు లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

## గొర్రెలు, మేకలకు పిపిఆర్ టీకాలు

ప్రజాశక్తి - ఉండి

పిపిఆర్ టీకాల ద్వారా ప్రతి రైతూ గొర్రెలు, మేకల్లో వచ్చే పారుడు వ్యాధిని అరికట్టవచ్చని మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రియాంక రాబర్ట్ అన్నారు. శుక్రవారం యండగండి గ్రామంలో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి గోగులమండ కృష్ణమూర్తి ప్రారంభించినారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి ప్రియాంక రాబర్ట్ మాట్లాడారు. ముసర వ్యాధికి, పిపిఆర్ వ్యాధికి దగ్గర సంబంధాలున్నాయన్నారు. ముసర వ్యాధి టీకాలు వేసినంత కాలం పిపిఆర్ వ్యాధి అదుపులో ఉంటుందన్నారు. పిపిఆర్ వ్యాధి మార్బిల్లి వైరస్ కారణంగా వస్తుందన్నారు. ఫిబ్రవరి నెలాఖరు వరకూ మండలంలోని ప్రతి గ్రామంలో మేకలు, గొర్రెలకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో 225 గొర్రెలకు, 50 మేకలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎహెచ్ఎ.గంగరాజు, ఎహెచ్ఎ.రవి, ఎహెచ్ఎ అనిల్, ఒఎస్ శ్రీనివాసు పాల్గొన్నారు.

## అదాని ఆస్తులను జప్తుచేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - పెంటపాడు

లక్షల కోట్ల రూపాయలు అవినీతికి కూరుకుపోయిన అదానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూ కేటాయింపులు చేయడం సిగ్గుచేటని సిపిఐ మండల సమితి కార్యదర్శి కళింగ లక్ష్మణరావు విమర్శించారు. శుక్రవారం పెంటపాడులో యూనియన్ బ్యాంక్ వద్ద కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసినందుకు, అదాని ఆస్తులు జప్తు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భారతదేశంలో ప్రజలకు కాకుండా ఒక శాతం ఉన్న కార్పొరేట్ అదానికి ఇతర బడా సంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా ఉందని విమర్శించారు. నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం మరిచి సంపన్నులను మరింత సంపన్నులుగా మార్చడానికి చూస్తున్నారని తెలిపారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజాతంత్ర శక్తులతో ఉద్యమాల ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వంక అప్పారావు, కొణతాల నాగరాజు, కొవ్వూరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్ సముద్ర తీరానికి తాబేలు కలేబరం శుక్రవారం కొట్టుకొచ్చింది. చేపల వేటకు సముద్రంలోకి వెళ్లే పడవల తాకిడికి గాయపడి మృతి చెంది ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.


కోతుల కలేబరాల నమూనాలు సేకరిస్తున్న అధికారులు

## కోతుల కళేబరాలకు పోస్టుమార్టం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపిపాలెంసౌత్ సముద్రతీరంలో సర్వే తోటల్లో చనిపోయి ఉన్న కోతులకు అధికారులు శుక్రవారం పోస్టుమార్టం చేశారు. తీరంలోని తోటల్లో భారీ సంఖ్యలో కోతుల కలేబరాలు ఉండడంతో స్పందించిన అధికారులు విచారణ చేయాలని ఆయా శాఖల సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో పశుసంవర్ధక, అటవీ శాఖ అధికారులు సంఘటన ప్రాంతానికి వచ్చి కోతుల కలేబరాల నుంచి నమూనాలు సేకరించారు. మృతదేహాలను ఖననం చేయించారు. దీనిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఫారెస్ట్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిడిఎల్ ఎడి సుచరిత, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఫిరోజ్, వెటర్నరీ వైద్యులు జి.నీలిమ, డాక్టర్ ఇంజేటి సురేంద్ర, ఫారెస్ట్ స్క్వాడ్ డిఎఫ్ఒ త్రిమూర్తులు రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అబ్దుల్ భారీ పాల్గొన్నారు.

## లే అవుట్‌లో నీరు తొలగింపు

### ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పెనుమంట్ర

లేఅవుట్‌లోకి నీళ్లు.. లబ్ధిదారులకు కన్నీళ్లు శీర్షికన శుక్రవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వి.పూర్ణ బాబ్జి ఆదేశాల మేరకు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్.మోహన్‌రావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరసింహ పనులు చేపట్టారు. అయితే అవి పూర్తిస్థాయిలో కాకుండా తాత్కాలికంగానే చేపట్టారు. కేవలం పొలాల నీరు లేఅవుట్‌లోకి రాకుండా మాత్రమే కట్టడి చేశారే తప్ప, ముంపునకు గురైన ప్రాంతాన్ని పూడిక చేయలేదు. కేవలం ప్రొక్లైన్‌తో వరి చేను నుంచి సాగునీరు లేఅవుట్‌లోకి రాకుండా తాత్కాలికంగా పనులు పూర్తి చేశారు.

## ఘనంగా దాసాంజనేయ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట కచేరీ సెంటర్లోని దాసాంజనేయస్వామి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి శ్రీరామ ఐస్ పార్లర్ అధినేత తాళ్లూరి రామ్మోహన్‌రావు విజయలక్ష్మి దంపతులచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రధాన వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఈ సందర్భంగా జోడు గుర్రాలు, గుర్రాల డాన్స్ వేషధారణలతో డాన్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి సూర్యనారాయణ, తాళ్లూరి రామ్మోహనరావు, బుద్ధరాజు విద్యాసాగర్, నంబూరి ఆంజనేయులు, నెక్కంటి బాపన్న పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి భారీ ఏర్పాట్లు : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహాశివరాత్రి సందర్భంగా పంచారామ క్షేత్రాల్లో ఒకటైన గునుపూడి శ్రీసోమేశ్వర జనార్ధన స్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 16 నుండి 20వ తేదీ వరకూ జరుగుతున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా చేయాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఆలయ అధికారులను, పాలకమండలిని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయ మహోత్సవాల పుస్తకాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచారామ క్షేత్రం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలిపారు. దర్శనం టికెట్ల ధరలు ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచొద్దని ఆదేశించారు. గతంలో ఉన్న దర్శనం టికెట్ల ధరల ప్రకారమే నడుచుకోవాలన్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుండి కూడా బస్సుల్లో, అదే మాదిరిగా ఇతర వాహనాలలో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుగానే రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని పేర్కొన్నారు. తాగునీరు, శానిటేషన్ విషయంలో మున్సిపల్ అధికారులు తగిన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు కోడే విజయలక్ష్మి, కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్‌కుమార్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

**POST ADOPTION ANNOUNCEMENT**

We are going to replace biological father name **Venkata Rama Reddy Dwarampudi,** with the step father name **Lakshmi Narayana Reddy Dwarampudi** in our minor child passport (passport number-p3735120). The adoption document (BK-4, CS No 2/2023 & Doct no 2/2023) got registered at sub register office with the consent of biological father i.e Venkata Rama Reddy Dwarampudi.

**LAKSHMI NARAYANA REDDY DWARAMPUDI (z6910247) and my wife LAKSHMI NAGA KALYANI (w8108260)**

## 14న మహాధర్నాకు తరలిరావాలి

### విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు గణేష్‌రావు

ప్రజాశక్తి - పాలకోడేరు

భీమవరం కలెక్టరేట్ వద్ద ఈ నెల 14న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన మహా ధర్నాకు తరలిరావాలని సంఘం జిల్లా అధ్యక్షులు గణేష్ రావు పిలుపునిచ్చారు. పాలకోడేరులో శుక్రవారం గ్రామ రెవెన్యూ సంఘం జిల్లా సమావేశం మండల అధ్యక్షులు సనమండ్ర నాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్‌రావు మాట్లాడుతూ 19 మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు ఈ బాధ్యత తీసుకుని మహా ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఫేస్ యాప్ నుంచి విఆర్ఎలను మినహాయించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్‌ఫోన్ కావాలని అధికారులు ఒత్తిడులు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో నర్సాపురం డివిజన్ అధ్యక్షులు మోటూరి మోసే, భీమవరం డివిజన్ అధ్యక్షుడు బివి ఎవి.పండు, ఎం.సుబ్బారావు. ఆకుమూర్తి రూబినమ్మ పాల్గొన్నారు

**డాక్యుమెంట్స్ పోయినవి**

మొరమర్ల సత్యన్నారాయణ, తండ్రి: చిట్టియ్య అను నేను ది. 20-12-2022వ తేదీన పూళ్ళ నుండి భీమడోలు సబ్-రిజిస్ట్రార్ ఆఫీసునకు సలహా నిమిత్తం వెళ్తుండగా దారి మధ్యలో మా తల్లి గార్కి చెందిన **నెం. 2422/2008** గల ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది చిరునామాకు తెలియపర్చగలరు.

**మొరమర్ల సత్యన్నారాయణ**
**పూళ్ళ, ఏలూరు జిల్లా**
**సెల్: 7993035234, 9346900055**

## పుంత భూమిని సర్వే చేయాలని రైతుల వినతి

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడిలో సర్వే నంబర్ 534,535లో పుంత భూమి ఆక్రమణకు గురైందని సర్వే చేయాలని గ్రామ రైతులు శుక్రవారం తహశీల్దార్ టిఎ కృష్ణారావుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ పుంత భూమిలో ఉన్న జమాయిల్ చెట్లు, సరుగు చెట్లు తొలగించి ఆ స్థానం లో 70 కొబ్బరి చెట్లు వేశారు. పుంత నుంచి ఆక్రమించి రైతులను వెళ్లకుండా అడ్డుకుంటున్నారని సర్వే చేయాలని రైతులు తహశీల్దార్‌ను కోరారు.

## కార్పొరేట్లకు కేంద్రం తొత్తు

ప్రజాశక్తి - ఉండి

కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం అనుకూలంగా మారి పేదల సంక్షేమం పూర్తిగా విస్మరించిందని సిపిఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు అన్నారు. బడ్జెట్‌ను నిరసిస్తూ స్థానిక ఎస్‌బిఐ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఉపాధి హామీకి భారీగా నిధుల్లో కోత విధించడం జరిగిందన్నారు. వ్యవసాయానికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదని, రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపించిందని విమర్శించారు. ఈ ధర్నాలో సిపిఐ నాయకులు పతివాడ గణపతి, సనపల శ్రీను, కొడవర్తి రమేష్, మంతెన కృష్ణ, కలిశెట్టి శ్రీను, కామన కొండ, బొండాడ నాగరాజు పాల్గొన్నారు.

## సీసలిలో చోరీ

ప్రజాశక్తి - కాళ్ల

సీసలిలో చోరీ జరిగిన సంఘటనపై కాళ్ల పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీసలి గ్రామానికి చెందిన వాస్కూరి పవన్ మణికంఠ ఈ నెల 8వ తేదీన బర్తడే ఫంక్షన్ ఉందని కుటుంబ సభ్యులతో కలిసి వేరే ప్రాంతానికి వెళ్లాడు. 9వ తేదీ సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. అనుమానంతో చూడగా రూ.60 వేల విలువైన మూడుకాసుల బంగారం, 100 గ్రాములు వెండి చోరీకి గురైందని గుర్తించాడు. మణికంఠ ఫిర్యాదుతో ఎస్ఐ మూర్తి కేసు నమోదు చేశారని పోలీసులు తెలిపారు.

**మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు**
**ఒ.యస్. నెం. 213/2016**

బిట్వీన్:
గాదంశెట్టి సురేష్‌బాబు -వాది
మరియు
పామర్తి జగదీష్ -ప్రతివాది

**వాది దాఖలు చేసిన పబ్లికేషన్**

పై నంబరు గల దావాలో ప్రతివాది అయిన పామర్తి జగదీష్, S/o. గోవర్ధనరావు, డోరు నెం. 16B-16-13/2, పుష్పలీల నగర్, తంగెళ్ళమూడి, ఏలూరు, ఏలూరు జిల్లా వారికి పై కోర్టు వారి ఎదుట **ది. 24-2-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని తమ ఆక్షేపణలు తెలియపరచుకొనవచ్చును. లేని ఎడల సదరు దావా తమ పరోక్షమున విచారణ జరుగునని ఇందుమూలముగా తెలియచేయడమయినది.

**ఆవుల జగన్మోహనరావు**
**పుప్పాల రామకృష్ణ**
అడ్వకేట్సు
ఏలూరు శ్రీరామనగర్, ఏలూరు
ది.10-2-23 ప॥గో॥జిల్లా

**దస్తావేజులు పడిపోయినవి**

నా క్లయింటును, పశ్చిమగోదావరి జిల్లా, నరసాపురం మండలం, నరసాపురం గ్రామం, ఆకుల నరసింహమూర్తి గారి వీధి, డోర్ నెం. 8-3-2, లేటు కటకంశెట్టి సత్యనారాయణ గారి భార్య ఛాయాదేవి గారి ఇంటి ఆస్తి బాపతు లింక్ దస్తావేజులు అనగా సదరు డోర్ నెంబరు దాఖల ఆర్‌సిసి బిల్డింగ్ మరియు అందలి కార్ షెడ్ దాఖల శ్రీ నరసాపురం సబ్ రిజిస్ట్రార్ నందలి రిజిస్ట్రీ కాబడిన **క్రయ దస్తావేజు నెం. 2337/1974 రు** ను, నా క్లయింటు ది. 08-02-2023వ తేదీన నడుచుకుంటూ ఫోటోస్టాట్ తీయించుటకు తీసుకుని వెళ్ళగా సదరు దస్తావేజు స్టీమర్ రోడ్డు, నరసాపురంలో పడిపోయినది. ఎంత వెదికినను దొరకలేదు. కావున ఎవరికైననూ సదరు దస్తావేజు దొరికిన ఎడల వెంటనే ఈక్రింది అడ్రస్ నందు గాని, పైన తెలిపిన మా క్లయింట్ అడ్రస్ నందు గాని ఇవ్వగలరు.

**రాయప్రోలు రాజ కిరణ్**
**రాయప్రోలు అజీజున్నీసా బేగమ్**
న్యాయవాదులు, డోర్ నెం.21-1-6,
సొసైటీ రోడ్, తణుకు, సెల్: 8341437279

**In the Court of the Hon'ble I Addl. Junior Civil Judge, Eluru**
**I.A. No. /2022, I.A. No. 179/2022**
**I.A. No. 46/2020, O.S. No. 73/2020**

*Between:*
Sri Kilaru Ravindra Prasad ***...Petitioner***
AND
Sri Kallakuri Durga Rao (died) and Others ***...Respondents***

పై నెంబరు పిటీషన్‌లో R2, R3, R4 అయిన
***R-2:*** Smt. Kallakuri Seshu, W/o. late Durga Rao.
***R-3:*** Sri Kallakuri Ramabhadra, S/o. late Durga Rao.
***R-4:*** Smt. Kallakuri Gowthami, D/o. late Durga Rao, R/o. D.No. 23A-6-7, C/o. Gopi Krishna Paper Publications, Sankaramatam Road, R.R.Pet, Eluru, W.G.Dist.,

అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 27-2-2023 వాయిదా అయివున్నది.** కావున సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు తీర్మానించెదరు.

*(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)*

ఏలూరు **ఈ.శ్రీనివాసబాబు**
09-2-2023 అడ్వకేట్, ఏలూరు

**In the Court of the Hon'ble I Addl. Junior Civil Judge, Eluru**
**I.A. No. /2022, I.A. No. /2022**
**I.A. No. 180/2022, O.S. No. 73/2020**

*Between:*
Sri Kilaru Ravindra Prasad ***...Petitioner***
AND
Sri Kallakuri Durga Rao (died) and Others ***...Respondents***

పై నెంబరు పిటీషన్‌లో R2, R3, R4 అయిన
***R-2:*** Smt. Kallakuri Seshu, W/o. late Durga Rao.
***R-3:*** Sri Kallakuri Ramabhadra, S/o. late Durga Rao.
***R-4:*** Smt. Kallakuri Gowthami, D/o. late Durga Rao, R/o. D.No. 23A-6-7, C/o. Gopi Krishna Paper Publications, Sankaramatam Road, R.R.Pet, Eluru, W.G.Dist.,

అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 27-2-2023 వాయిదా అయివున్నది.** కావున సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు తీర్మానించెదరు.

*(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)*

ఏలూరు **ఈ.శ్రీనివాసబాబు**
09-2-2023 అడ్వకేట్, ఏలూరు

**In the Court of the Hon'ble I Addl. Junior Civil Judge, Eluru**
**I.A. No. /2022, I.A. No. 178/2022**
**I.A. No. 46/2020, O.S. No. 73/2020**

*Between:*
Sri Kilaru Ravindra Prasad ***...Petitioner***
AND
Sri Kallakuri Durga Rao (died) and Others ***...Respondents***

పై నెంబరు పిటీషన్‌లో R2, R3, R4 అయిన
***R-2:*** Smt. Kallakuri Seshu, W/o. late Durga Rao.
***R-3:*** Sri Kallakuri Ramabhadra, S/o. late Durga Rao.
***R-4:*** Smt. Kallakuri Gowthami, D/o. late Durga Rao, R/o. D.No. 23A-6-7, C/o. Gopi Krishna Paper Publications, Sankaramatam Road, R.R.Pet, Eluru, W.G.Dist.,

అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 27-2-2023 వాయిదా అయివున్నది.** కావున సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు తీర్మానించెదరు.

*(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)*

ఏలూరు **ఈ.శ్రీనివాసబాబు**
09-2-2023 అడ్వకేట్, ఏలూరు

**In the Court of the Hon'ble I Addl. Junior Civil Judge, Eluru**
**I.A. No. /2022, I.A. No. /2022**
**I.A. No. 181/2022, O.S. No. 73/2020**

*Between:*
Sri Kilaru Ravindra Prasad ***...Petitioner***
AND
Sri Kallakuri Durga Rao (died) and Others ***...Respondents***

పై నెంబరు పిటీషన్‌లో R2, R3, R4 అయిన
***R-2:*** Smt. Kallakuri Seshu, W/o. late Durga Rao.
***R-3:*** Sri Kallakuri Ramabhadra, S/o. late Durga Rao.
***R-4:*** Smt. Kallakuri Gowthami, D/o. late Durga Rao, R/o. D.No. 23A-6-7, C/o. Gopi Krishna Paper Publications, Sankaramatam Road, R.R.Pet, Eluru, W.G.Dist.,

అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 27-2-2023 వాయిదా అయివున్నది.** కావున సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు తీర్మానించెదరు.

*(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)*

ఏలూరు **ఈ.శ్రీనివాసబాబు**
09-2-2023 అడ్వకేట్, ఏలూరు